క్లుప్తంగా

శక్తివంచన లేకుండా కృషి చేయాలి



శివనాథ్‌ను సత్కరిస్తున్న తోట నరసింహం

కిర్లంపూడి: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ పటిష్ట తకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కోఆర్డినేటర్ తోట నరసింహం అన్నారు. పార్టీ రాష్ట్ర సెక్రటరీ, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల పరిశీలకులుగా కొప్పన శివనాథ్ నియమితులైయ్యారు. ఈ మేరకు శుక్రవారం వీరవరంలోని తోట నరసింహంను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నరసింహం శివనాథ్‌ను సాల్వాతో సత్కరించారు.

విరాళాలు అందించిన ముదునూరి



ఒమ్మంగిలో విరాళాన్ని అందజేస్తున్న ముదునూరి మురళీ కృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో భవాని పడిపూజా కార్యక్రమాన్ని భవాని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పడిపూజ నిర్వహకులకు రూ.10 వేలు విరాళాన్ని అందజేయగా పడి పూజ నిర్వహకులు సన్మానించారు. ధర్మవరంలో సీతంపేట రామాలయం వద్ద లక్ష్మీ గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మురళీకృష్ణంరాజు పాల్గొని ఆలయ కమిటీకి రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న యూనివర్సిటీ చాన్సలర్

గండేపల్లి: శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని ఆదిత్య యూనివర్సిటీ చాన్సలర్ ఎన్.శేషారెడ్డి క్రీడాకారులనుద్దేశించి అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బాలికల హాస్టల్ నందు మహిళా కబడ్డీ ఫైనల్ పోటీల చివరి రోజు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడా పోటీల వల్ల పోటీతత్వం, స్నేహభావం పెంపొందుతాయన్నారు. గెలుపొందిన విజేత టీమ్‌కు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ ఇన్‌చార్జి జి.హరీష్ రెడ్డి, వార్డెన్ సరిత ఫిజికల్ డైరెక్టర్ రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహం ఎత్తు పెంచాలి



నిరసన తెలుపుతున్న దండోరా ప్రతినిధులు

తుని: స్థానిక రైల్వేస్టేషన్ ముందు ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహం ఎత్తు పెంచాలని దండోరా ప్రతినిధులు విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అల్లూరి సీతారామరాజుకు తునితో నడయాడిన చరిత్ర ఉందని, అల్లూరి విగ్రహాన్ని కేవలం నాలుగైదు అడుగులకు పరిమితం చేయడం సమంజసం కాదన్నారు. కనీసం 12 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే, దండోరా నాయకులు పెదపూడి గవరయ్య, ఏడిది సత్యనారాయణ, మోటుకూరు ఏసు, తుమ్మలపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పగలే వెలుగులు



మల్లేపల్లిలో వెలుగుతున్న వీధి దీపాలు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి గ్రామంలో వీధి దీపాలు పగలు వెలుగుతుండటంతో స్థానికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. గ్రామంలోని బీసీ కాలనీ, సుబ్బయమ్మపేట వెళ్లే మార్గంలోనూ, తదితర చోట్ల వీధి దీపాలు గత కొన్ని రోజుల నుంచి నిరంతరం వెలుగుతుండటంతో స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. విద్యుత్ శాఖ, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కూరగాయాలు

- గిట్టుబాటు లేక ధరలు పతనం
- దిగుబడి బాగున్నా ఆదాయం లేదని ఆవేదన
- సాగుపై ఆసక్తి చూపని రైతులు



జి.కొత్తపల్లిలో చిక్కుడు తోటలు



మండపంలో సాగుచేస్తున్న మిరప పంట

శంఖవరం: స్థానిక హోల్‌సేల్ మార్కెట్‌లో కూరగాయల ధరలు తగ్గుతుండడంతో సాగుదారులు డీలా పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా బీర, బెండ, చిక్కుడు, మిరప, వంగ, టమాటా ధరలు 40 శాతం మేర తగ్గిపోవడంతో నిరాశ చెందుతున్నారు. సాగు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధర మాత్రం నామమాత్రంగా ఉంటుంది. దీంతో రైతులు కూరగాయల పంటల్లో నష్టాలు ఎదుర్కోవలసి వస్తోంది.

ఇదీ పరిస్థితి

శంఖవరం మండలంలో 14 పంచాయతీలకు సంబంధించి ఈ ఏడాది పలు గ్రామాల్లో సుమారు 200 ఎకరాల వరకు కాయగూరలు పంటలు సాగు చేస్తున్నారు. మండపం, వజ్రకూటం, కొత్తపల్లి, కొంతంగి, గౌరంపేట, మాసంపల్లి, గొంది, నెల్లిపూడి, కత్తిపూడి తదితర గ్రామాల్లో రైతులు ప్రతి ఏడాది సీజన్ వారిగా పంటలు సాగు వేస్తున్నారు. టమాటా, వంగ, చిక్కుడు, మిరప, కాకర వంటి పంటలు వేస్తున్నారు. అంతర పంటలుగా పూల తోటలను సైతం సాగు చేస్తున్నారు.

పెట్టుబడులు అధికం..

దుక్కులు, విత్తనాలు, కూలీ ఖర్చుల నిమిత్తం ప్రతి ఏటా ఎకరానికి సుమారు రూ.30 నుంచి 40 వేల వరకు పెట్టుబడులు అధికంగా పెడుతున్నారు. వాతావరణ పరిస్థితి అనుకూలంగా ఉంటే పంటల్లో దిగుబడి అధికంగా వస్తున్నాయి. మార్పులు సంభవిస్తే నష్టాలు ఎదుర్కోనవలసిన పరిస్థితి నెలకొంటుంది.

దళారుల బెడద

కూరగాయల పంటలు ఎకరానికి కోతలు వారిగా వంగ ఎకరాకు 350 నుండి 400 కేజీలు, టమాటా 200 కేజీలు, చిక్కుడు 200 కేజీలు వరకు దిగుబడి వస్తుంది. రైతులందరూ దిగుబడి అయిన పంటలు తుకాలు వేసి పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, కాకినాడ, దివిలి తదితర మార్కెట్లకు తరలిస్తుంటారు. అయితే దళారుల బెడద కారణంగా రైతులకు ఆశించిన స్థాయిలో ధర రావడం లేదు. ప్రస్తుతం మార్కెట్లో 10 కేజీల టమాటా రూ.60, వంగ రూ.150, చికెడు రూ.150 ధరలు ఉండడం వలన కనీసం పెట్టబడులు రావడం లేదని, సంబంధిత అధికారులు స్పందించి పంటలకు సంబంధించి తగు సూచనలు, సలహాలు ఇవ్వడంతో ప్రభుత్వానికి నివేదిక అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, ఆరుగాలం శ్రమించి పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు ఉండడం లేదని రైతన్నలు వాపోతున్నారు. ప్రకృతి వైరీత్యాల వల్ల కూరగాయ పంటలు పండక, ఒకవేళ ప్రకృతి సహకరించి ఆరుగాలం కష్టపడి రైతు పంట పండిస్తుంటే దళారులు, వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. రైతులు అష్టకష్టాలు పడి పండించిన పంట దళారులు తక్కువ రేటుకు కొనుగోలు చేసుకుని అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని, కూరగాయ పంటలను ప్రభుత్వమే గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

పెట్టుబడి రావడం లేదు



అధిక పెట్టబడులు పెట్టి పండించిన పంటకు కనీసం పెట్టబడులు కూడా రావడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. దళారీ బెడద ఎక్కువగా ఉండడం వలన పంటను నేరుగా మార్కెట్లో అమ్మలేకపోతున్నాం. మాలాంటి సన్నకారు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాం.

– నక్కా నాగేశ్వరరావు, చిక్కెడు పంట రైతు, మండపం

గిట్టుబాటు ధర కల్పించండి



ప్రభుత్వం కూరగాయల పంటలకు సంబంధించి గిట్టబాటు ధర కల్పించాలి. ఎకరానికి రూ.30 వేలు వరకు పెట్టబడులు పెట్టినా నష్టాలు వస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలకు మరింత నష్టం వస్తుంది. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.

– చొప్పా శ్రీను, టమాటో రైతు, జి.కొత్తపల్లి

బాలకృష్ణ తక్షణం క్షమాపణ చెప్పాలి



ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై రాష్ట్ర శాసనసభలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సభాపద్ధతులను పాటించకుండా అసెంబ్లీలో స్పీకర్‌ను, మంత్రిని అగౌరవ పరిచి మాట్లాడే బాలకృష్ణను ఎందుకు గెలిపించమా అని ప్రజలు బాధపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రిగా ప్రజలకు ఎంతో మేలు చేసిన ఎన్టీ రామారావు పరువు తీసిన ఘనత బాలకృష్ణకే దక్కుతుందన్నారు. దేవాలయం లాంటి శాసనసభలో మాజీ ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే కూటమి ఎమ్మెల్యేలు నవ్వడం దారుణమన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చేసిన మేలును మరిచిపోయిన బాలకృష్ణ నేడు సైకోలా వ్యవహరిస్తున్నడని విమర్శించారు. అసెంబ్లీలో జరిగిన ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బాలకృష్ణ తక్షణం క్షమాపణ చెప్పకపోతే భవిష్యత్‌లో ప్రజలే బుద్ధి చెబుతారని గిరిబాబు హెచ్చరించారు.

సిరులు కురిపించే మహాలక్ష్మి



ఏలేశ్వరంలో కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు



రౌతులపూడి సినిమా సెంటర్‌లో మహాలక్ష్మీదేవిగా అలంకరణవారు



రామచంద్రపురంలో లక్ష్మీదేవి అవతారంలో..



రూ.30 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించిన దేవీచౌక్ కనకదుర్గమ్మ వారు

కిర్లంపూడి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఐదోవ రోజు శుక్రవారం రామచంద్రపురంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ వారు మహాలక్ష్మీ అమ్మవారి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సుమారు రూ.2 లక్షల రూపాయాల కరెన్సీ నోట్లతో అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవరబొట్ల రామకృష్ణశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తుల పాల్గొన్నారు.

ఏలేశ్వరం: శ్రీదేవి శరన్నవరాత్రలను పురస్కరించుకుని పట్టణంలోని తోటవీధి, దిబ్బలపాలెంలోని సంతోషిమాత ఆలయాల వద్ద అమ్మవార్లను కరెన్సీ నోట్లతో ఆలంకరించారు. నవరాత్రల్లో భాగంగా మహిళలు కుంకుమపూజలు చేస్తున్నారు. విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దుర్గాదేవి ఆలయంలో మహాలక్ష్మీ దేవి సహస్ర నామార్చన, లక్ష్మీ అష్టోత్తరం పఠించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరీటి, తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లతో కనక దుర్గమ్మవారి అలంకరణ

రౌతులపూడి: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక సినిమా సెంటర్‌లో వేంచేసియున్న కనక దుర్గ అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జాము నుంచే అమ్మవారి ఆలయానికి వచ్చి మహాలక్ష్మీ దేవిగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకున్నారు. ఆనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కుంకమార్చన కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని పురోహితులు బానుభాబు తదితరులు వేదమంత్రోచ్ఛరణ చేశారు.

సామూహిక సహస్ర కుంకమ పూజలు

జగ్గంపేట: మండల కేంద్రం టీచర్స్ కాలనీ రామాలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కాలనీకి చెందిన కరుటూరి వెంకటలక్ష్మి, గుర్రం వేణు, అడపా లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రువారం అమ్మవారికి సామూహిక సహస్ర కుంకమ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో కుంకమపూజలలో పాల్గొని దుర్గా అమ్మవారిని భక్తితో పూజించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు కరుటూరి వీర్రాజు, అడపా శ్రీను, స్థానికులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ దేవిగా దర్శనం

ప్రత్తిపాడు రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో 5వ రోజు శుక్రవారం దుర్గాదేవి అమ్మవారు మహాలక్ష్మీ దేవి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాచపల్లి అరుణాచల క్షేత్రంలో అపిత కుచాంబా, ధర్మవరం సూర్యారావుపేటలో కనక దుర్గమ్మ, ఒమ్మంగి విజయదుర్గ అమ్మవార్లను మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

నిప్పుల గుండం తొక్కిన భక్తులు

ప్రత్తిపాడు రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో 5వ రోజు శుక్రవారం దుర్గాదేవి అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాచపల్లి అరుణాచల క్షేత్రంలో అపిత కుచాంబా, ధర్మవరం సూర్యారావుపేటలో కనక దుర్గమ్మ, ఒమ్మంగి విజయదుర్గ అమ్మవార్లను మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. రాచపల్లిలో భవాని భక్తులు అగ్నిగుండం తొక్కారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

అన్నపూర్ణాదేవి అలంకరణలో నేరేళ్లమ్మ

తొండంగి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోపాలపట్నంలో నేరేళ్లమ్మ అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు, నిత్యపూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన యడ్ల అప్పలరాజు రామలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో అమ్మవారికి అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో భజనలు, భక్తిపాటలు ఆలపించారు. అదేవిధంగా మండలంలోని పలు దుర్గామాత ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

రూ.30 లక్షల కరెన్సీతో అలంకారం

గోకవరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదవ రోజు గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైయున్న శ్రీ కనకదుర్గమ్మ వారు మహాలక్ష్మీదేవి అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.30 లక్షల నగదుతో సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాధశర్మ, శ్రీనివాస్‌శర్మలు అమ్మవారికి అలంకారం పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సమాజం సిగ్గుపడేలా బాలకృష్ణ వ్యాఖ్యలు



ముదునూరి మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చెయ్యడం అమానుషమని, ఆ పార్టీ పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని ధర్మవరంలో ఆయన స్వగృహం నందు ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. సమాజం సిగ్గుపడేలా బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిపినప్పుడు అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏ తరహాలో సహాయం చేశారో ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. అప్పట్లో మానసిక పరిస్థితి బాగోలేదని డాక్టర్ సర్టిఫికెట్ తెచ్చుకొని ఆ కేసు నుంచి బయటపడ్డావని.. అలాంటి నువ్వు మాజీ సీఎం జగన్‌ను సైకో అనడం ఆయన మానసిక పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చెయ్యని నీ వియ్యంకుడు చంద్రబాబును నువ్వు ప్రశ్నించాలని హితవు పలికారు.

సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి



పెద్దనాపల్లిలో మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏలేశ్వరం: 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో శుక్రవారం ఉచితంగా మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సదర్భంగా శిబిరంలో పలువురు రోగులకు వైద్యులు బి.రాంబాబు నాయక్, కె.స్నేహాల్ మహిళలకు స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, రొమ్ము, నోటి, గర్భశయ క్యాన్సర్ పరీక్షలు చేశారు. వైద్యులు మాట్లాడుతూ ప్రభుత్వ అదేశాల మేరకు మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సుంకర సత్యనారాయణ, శెట్టి చిన్నా, బుద్ధా ఈశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు పాటించాలి

గండేపల్లి: గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారిణి హరిత పేర్కొన్నారు. మండలంలోని తాళ్లూరులో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పోషణ విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సర్పంచ్ శీలాముంతుల వీరబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపార్వతి, ఐసీడీఎస్ కార్యకర్తలు వెంకటలక్ష్మి, పి.చిన్నారి, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని టి.రాయవరం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉషశ్రీ, కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి చిల్డ్రన్ స్పెషలిస్టు సాయి ప్రదీప్ బాలింతలకు, గర్భిణులకు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తటవర్తి సుబ్బారావు, వెంకన్నబాబు, శోభన్ బాబు, వైద్య ఆరోగ్యశాఖ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి



కోటనందూరులో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజుబాబు

కోటనందూరు: పంచాయతీలకు సమకూర్చే ఆదాయ వనరులపై దృష్టి సారించాలని ఎంపీడీఓ పీ.వెంకటనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల సొంత ఆదాయ వనరుల సమీకరణపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శిలకు రెండు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలు, షాపులు, చేపల చెరువులు తదితర వాటిని లీజుకి ఇచ్చి ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. సంపద కేంద్రాల్లో రీసైక్లింగ్ ద్వారా కంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించే వెసులుబాటు ఉందన్నారు. పంచాయతీలకు ఆదాయ మార్గాలపై ఎంపీడీఓ నారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ జయరాం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

గ్రామాభివృద్ధిపై అధికారులకు శిక్షణ

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్టు ఎంపీడీఓ కె.హరికృష్ణ సత్యారెడ్డి తెలిపారు. పన్ను వసూళ్ల కోసం సమాజంలో వ్యక్తిగత ప్రవర్తనా నియమావళి అమలు, వినూత్న ప్రాజెక్టుల ఏర్పాటుకు నిధుల సమీకరణ మార్గాలు, సొంత ఆదాయం పెంచుకునేందుకు వ్యూహాలు, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ప్రాజెక్టు నిర్వాహణ నైపుణ్యాల ప్రాముఖ్యత, పంచాయతీ సుస్థిర వనరుల కల్పన కొరకు ఆదాయ అంచనా, ప్రణాళిక, గ్రామాభివృద్ధికి సొంత ఆదాయ మార్గాలను ఉపయోగించుకోవడం, తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఐఎన్ శ్రీనివాస్, ఏఓ కె.చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

శంఖవరం: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు ఎంపీపీ పర్వత రాజుబాబు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. తాగునీరు అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీని అభివృద్ధి కోసం ప్రణాళికలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వై.నాగలక్ష్మి,సీనియర్ అసిస్టెంట్ కీర్తన తదితరులు పాల్గొన్నారు.


సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

ప్రత్తిపాడు: గ్రామ స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే పల్లెలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. ప్రత్తిపాడు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులను పెంపుదలపై మండల స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఇన్‌చార్జి ఎంపీడీఓ కేవీవీఎస్ కాశీవిశ్వనాథం మాట్లాడుతూ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పంచాయతీల అభివృద్ధికి పాటు పడాలన్నారు. పంచాయతీల వనరులను, ఆదాయ మార్గాలను పెంపుదల వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఏలేశ్వరం: మండలంలోని పేరవరం గ్రామంలోని అగ్ని ప్రమాద బాధితులకు శుక్రవారం దాతలు సహాయం చేశారు. గ్రామంలోని ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సుందరరావు బాధితులకు 50 కేజీల బియ్యం, వంటసామాగ్రి, వస్త్రాలు అందజేశారు. ప్రమాదంలో పూర్తిగా నిరాశ్రయులైన బాధితులకు తన వంతు సాయంగా వీటిని అందిచినట్లు తెలిపారు.

అన్నప్రసాద వితరణ



ధారాలమ్మ సన్నిధిలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

తుని రూరల్: తుని పట్టణానికి శివారులో ఉన్న ధారాలమ్మ గుడివద్ద శరన్నవరాత్రలను పురస్కరించుకుని భవానీ భక్తులకు నిత్యాన్న ప్రసాద వితరణ చేస్తున్నట్లు శుక్రవారం నిర్వహకులు రొంగల సత్తిబాబు పేర్కొన్నారు. మాలధారణ చేసిన భక్తులకు నవరాత్రుల పవిత్ర రోజులు పూర్తయ్యే వరకు ప్రతిరోజు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని వివిధ గ్రామాల నుంచి వచ్చే భవానీలకు పరిమితి లేకుండ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సాగునీరు పారేందుకు చర్యలు

గండేపల్లి: పంటలకు సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని పుష్కర, పోలవరం ఈఈ రాజేశ్వరరావు తెలియజేశారు. మండలంలోని బొర్రంపాలెంలో పంట కాలువ గురించి గ్రీవెన్స్‌లో గ్రామస్తులు అందించిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పరిశీలన నిమిత్తం వచ్చినట్టు పేర్కొన్నారు. పరిశీలన అనంతరం ఇరు వర్గాల నుంచి వివరాలు తెలుసుకుని పంట కాలువకు పైపులైన్ వేయించి నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఆయన వెంట డిఈఈ నాగేంద్ర, ఏఈఈ ప్రమీల, పంచాయితీ కార్యదర్శి శారద, ఇరువర్గాల ప్రజలు గ్రామస్తులు ఉన్నారు.

వైద్య సేవలపై అధికారుల ఆరా

గోకవరం: గోకవరంలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన మెడికల్ క్యాంపు 104 రీజనల్ మేనేజర్ హిమజ, జిల్లా మేనేజర్ రవికిశోర్‌లు అకస్మికంగా తనిఖీ చేశారు. 104 వాహనంలో అందిస్తున్న సేవలు, డేటా ఎంట్రీని పరిశీలించి వైద్య సేవల గూర్చి డాక్టర్ నిఖితను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో టిబి సూ పర్‌వైజర్ శ్రీనివాస్, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యాధికారుల సమ్మె

గోకవరం: పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారులు శుక్రవారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు వైద్యుల భవిష్యత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈ సమ్మె చేపడుతున్నట్టు వైద్యాధికారులు డాక్టర్ తిరస్, డాక్టర నిఖితలు పేర్కొన్నారు. జీఓ నంబర్ 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరణ చేయాలని, సమయ నిర్ధారితమైన ప్రమోషన్లు ఇవ్వాలని, వివిధ అంశాలపై ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. సమ్మెలో తొలిరోజు ఆన్‌లైన్ రిపోర్టింగ్ సేవలు నిలిపివేశామన్నారు. 27న స్వచ్ఛనారీ కార్యక్రమం, 104 సంచార చికిత్స సేవలను బంద్ చేస్తున్నామన్నారు. 28న అధికారిక వాట్సాప్ గ్రూపు బహిష్కరణ, 29న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలు బంద్, సెప్టెంబర్ 30, అక్టోబర్ 1న జిల్లా కేంద్రాల్లో నిరసన, అక్టోబర్ 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వైద్యాధికారులు విజయవాడలో నిరసన, నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతున్నట్టు హెచ్చరించారు.